క్లుప్తంగా

'చేయూత' ఇవ్వండి



ఎంపీడీఓ రాధికతో మాట్లాడుతున్న మహిళలు

పూసపాటిరేగ : వైఎస్సార్ చేయూత పథకం నగదు ఇప్పించాలని పూసపాటిరేగ గొల్లపేటకు చెందిన పలువురు మహిళలు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం. రాధికను బుధవారం కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. పథకం డబ్బులు ఇంతవరకు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పెంటంనాయుడు, చందక అప్పయ్యమ్మ, చందక అసిరమ్మతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ఆదర్శ జీవనం



భగవాన్ భాయ్‌జీతో బ్రహ్మకుమారీలు

విజయనగరం టౌన్: ఆధ్యాత్మికత ద్వారా మానసిక వికాసం సాధ్యమవుతుందని తద్వారా ఆదర్శ జీవనాన్ని సాగించవచ్చని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ముఖ్య కేంద్రం రాజస్థాన్ మౌంట్ అబూ నుంచి వచ్చిన రాజయోగి బీకే భగవాన్ భాయ్‌జీ తెలిపారు. బుధవారం స్థానిక కంటోన్మెంట్ అదేవిధంగా కమ్మవీధిలో ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల్లో ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా ప్రతిఒక్కరూ రాజయోగ మెడిటేషన్ సాధన చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో ఇబ్బందులు



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యుత్ వినియోగంలో లేనిపోని ఆంక్షలు విధించి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. లక్ష్మణరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ, గడచిన కొద్ది నెలలుగా అదనపు వడ్డింపులు చేస్తున్నారని, దీంతో బిల్లు అమాంతం పెరిగిపోతోందన్నారు. అదనపు లోడు పేరుతో కూడా డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. జిల్లాలో దాదాపు 4 వేల మందికి అదనపు లోడు పేరుతో నోటీసులు ఇచ్చి డబ్బులు కట్టకపోతే ఫీజులు తీసేస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి వినియోగదారులకు న్యాయం చేయాలని కోరారు.

బాబాల ఆశ్రమాలపై నిఘా పెంచాలి

చీపురుపల్లి: బాబాల పేరుతో ఆశ్రమాలు నిర్వహిస్తూ అమాయక ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్న వారిపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కొన్నేళ్ల క్రితం తండేరా బాబా, ఇప్పుడు భోలే బాబా వల్ల ఎంతో మంది అమాయక ప్రజలు బలయ్యారని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు ఎన్ని చూడాల్సి వస్తుందోనని పేర్కొన్నారు. ఈ బాబాలు అమాయక ప్రజల మానసిక బలహీనతలతో ఆడుకుంటున్నారని, ధన, మాన, ప్రాణాలను హరిస్తుంటే ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇంతవరకు మూసుకున్న కళ్లను తెరిచి బాబాల ఆశ్రమాలపై నిఘా పెంచి అమాయక ప్రజలను కాపాడాలని కోరారు.

మెటల్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు



రోడ్డు నిర్మాణానికి పరిశీలన చేస్తున్న పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, తదితరులు

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామం నుంచి కోమటి చెరువు మీదుగా ఆతవ గ్రామానికి మెటల్ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశామని పంచాయతీరాజ్ ఏఈ మహ్మద్ ఆలీ తెలిపారు.కలెక్టర్ ఆదేశాలమేరకు శింగరాయి రామ కోవెల నుంచి ఆతవ గ్రామానికి సుమారు 1.05 కిలో మీటర్ల మేర మెటల్ రోడ్డు నిర్మాణానికి బుధవారం పరిశీలించారు.రూ. 20 లక్షల నిధులు అవసరమని ప్రతిపాధన లు ఉన్నతాధికారులకు పంపించామని ఏఈ తెలిపారు. సామాజిక కార్యకర్త అప్పారావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ లీల, వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమార్ పాల్గొన్నారు.

భవితకు దిక్సూచి..

- కాంపిటేటివ్ పుస్తకాలతో కొలువుదీరిన పూసపాటిరేగ శాఖా గ్రంథాలయం
- వినియోగించుకుంటున్న నిరుద్యోగులు, విద్యార్థులు
- పాఠకులు కోరిన పుస్తకాలు సమకూరుస్తున్న గ్రంథాలయ అధికారులు



పుస్తకాల విభాగం



పూసపాటిరేగ శాఖా గ్రంథాలయం

పూసపాటిరేగ: నిరుద్యోగ యువతకు పూసపాటిరేగ శాఖా గ్రంథాలయం దిక్సూచీగా నిలుస్తోంది. ప్రస్తుతం ఉద్యోగం పొందాలంటే తప్పనిసరిగా ఇతరులతో పోటీ పడాల్సిందే. అందుకు ఎంతో ఖరీదైన పుస్తకాలు కొనుగోలు చేసి మరీ చదవాలి. ఇటువంటి పరిస్థితుల్లో మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం నిరుద్యోగులకు వరంగా మారింది. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌కు గ్రంథాలయ సంస్థ వేలాది రుపాయలు ఖర్చు చేస్తూ అవసరమైన అన్ని కాంపిటేటివ్‌పుస్తకాలు సమకూరుస్తోంది. మండల కేంద్రంలోని రాజావీధి శాఖా గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు సుమారు 6 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు మరో వంద వరకు పుస్తకాలను గ్రంథాలయాధికారి ఎం. నాగేశ్వరరావు సమకూర్చారు. వాటిలో పోటీ పరీక్షలు, బాల సాహిత్యం, పురాణ గ్రంథాలు, గొప్ప వ్యక్తుల జీవిచరిత్రలు, కాంపిటేటివ్ పరీక్షకు సన్నద్ధమయ్య యువతకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో మరిన్ని పుస్తకాలు వస్తాయని నిర్వాహకులు తెలిపారు.

గ్రంథాలయం పనివేళలు ..

ఉదయం 8 నుంచి 11 గంటల వరకు.. మధ్యాహ్నం 4 గంటల నుంచి 7 వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుంది. ప్రధానంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయం ఎంతో ఉపకరిస్తుంది. నవలలతో పాటు వివిధ రకాల పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లే సౌలభ్యం కూడా కల్పిస్తున్నారు.

అన్ని రకాల పేపర్లు అందుబాటులో..

శాఖా గ్రంథాలయంలో అన్ని రకాలు దిన, వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటున్నాయి. పిల్లలు, పెద్దలు వినియోగించే పుస్తకాలు కూడా ఉన్నాయి. గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలి.

– జమ్మ శ్రీనివాసరావు, పాఠకుడు పూసపాటిరేగ

పోటీ పరీక్షల మెటీరియల్‌ఉంది..

పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాం. అందుకు కావాల్సిన మెటీరియల్ గ్రంథాలయంలో లభిస్తోంది. నిర్వాహకులు తీరుతో గ్రంథాలయం వాతావరణం చాలా బాగుంది. సిబ్బంది సహకరిస్తున్నారు.

కె.మధు, పాఠకుడు, పూసపాటిరేగ

మరిన్ని పుస్తకాలు..



అవసరాన్ని బట్టి మరిన్ని పుస్తకాలు సమకూర్చుతాం. ఇప్పటికే గ్రంథాలయంలో సుమారు 6 వేల వరకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన విలువైన పుస్తకాలు ఉన్నాయి. పాఠకులు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి.

– నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి, పూసపాటిరేగ

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు, ఉపాధ్యాయులు

- వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: విద్యార్థులు మాదకద్రవ్యాల మత్తులో తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వన్‌టౌన్ సీఐ డాక్టర్ బి. వెంకటరావు సూచించారు. ఎంఆర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా మాదక ద్రవ్యాలు – దుష్పరిణామాలు – యువత పాత్ర అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదువు పూర్తి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. తాత్కాలిక ఆనందం కోసం చెడు సహవాసాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దని సూచించారు. తల్లిదండ్రులు చెప్పే మంచి మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని, తద్వారా ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు డ్రగ్ ఫ్రీ ఆంధ్రాగా రాష్ట్రాన్ని మార్చేందుకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు అలజంగి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు స్నేహాలతో మొదట సరదాగా ఏర్పడిన మాదకద్రవ్యాల వినియోగం క్రమేపీ అలవాటుగా మారి జీవితాలను నాశనం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సీడ్ విముక్తి ప్రాజెక్ట్ ఆఫీసర్ వై.కాశీ ప్రసాద్, వన్‌టౌన్ ఎస్సైలు ఎ.నరేష్, హరిబాబునాయుడు, నవీన్ పడాల్, ఎంఆర్ కళాశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారి కల్యాణ్ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అల్లూరి జయంతి

విజయనగరం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని అల్లూరి సీతారామరాజు సేవా సమితి (బాబామెట్ట) ఆధ్వర్యంలో గురువారం స్థానిక దాసన్నపేట రైతుబజార్ జంక్షన్ వద్ద నిర్వహించనున్నట్లు సమితి సభ్యుడు కేఏపీ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, పాకలపాటి రఘువర్మ, ఇందుకూరి రఘురాజు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం పాల్గొనే ఈ కార్యక్రమంలో అల్లూరి అభిమానులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్‌టీసీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

విజయనగరం టౌన్: భారతీయ క్రిస్టియన్ దినోత్సవాలను విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో బుధవారం ఘనంగా నిర్వహించినట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్ నగర్‌లోని ఎన్‌టీసీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రేమానందం మాట్లాడుతూ, ఏసుక్రీస్తు శిష్యులలో ఒకరైన సెయింట్ థామస్ జ్ఞాపకార్థం భారతదేశమంతటా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల జీకే చర్చి పాస్టర్ బి.ఇమ్మాన్యుయేల్, బిషప్ వై.బెంజ్‌బాబు, రెవరెండ్ వై.ప్రశాంత్‌కుమార్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

చీపురుపల్లి: పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక కొత్తగవిడివీధికి చెందిన వై.నానిబాబు, రాణిశ్రీ దంపతులు రూ.75 వేల ఆర్థిక సహాయం చేశారు. ఆలయ ట్రస్టు సభ్యులకు దాత తన నివాసం వద్ద బుధవారం నగదు అందజేశారు. ట్రస్టు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, గురుస్వామి గుడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు ప్రణాళికలు

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పార్కుల సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యాన శాఖాధికారులతో సమావేశమయ్యారు. కార్పొరేషన్ ఉద్యాన శాఖాధికారి ఉమాభరణి, ఉద్యానశాఖ డీఈ ప్రవీణ్‌కుమార్‌లతో పార్కులలో చేపట్టబోయే కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో ప్రస్తుతం నాలుగు పార్కులు అన్ని హంగులతో అభివృద్ధి చెందాయన్నారు. మిగిలి ఉన్న పార్కులలో మొక్కలను పెంచి ఆహ్లాదకర వాతావరణం రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉద్యాన, అటవీశాఖ అధికారుల సంయుక్త సహకారంతో మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సంవత్సర కాలం పాటు మొక్కలను మనం బతికించుకుంటే ఆ తర్వాత వాటంతట అవే పెరుగుతాయన్నారు. అలాగే మొక్కల సంరక్షణకై జియో ట్యాగింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఈఈ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో పారిశుధ్యం అధ్వానం..

జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. నిత్యం అధికారులు తిరిగే ప్రాంతంలోనే చెత్త పేరుకుపోవడం, పిచ్చి మొక్కలతో పరిసరాలు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప వారు పాటించరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ఖజానా కార్యాలయం మార్గంలో చెత్త



కలెక్టరేట్ ఆవరణలో ఎండిన ఆకులు



కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయం ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త



ఖజానా కార్యాలయం వెనుక భాగంలో చెత్త



పోర్టుకో ప్రాంతంలో పిచ్చిమొక్కలు

శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకానికి సర్వం సిద్ధం



పట్టాభిషేక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీరామసేవా సమితి ప్రతినిధులు

విజయనగరం టౌన్ : శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు శ్రీరామసేవా సమితి ప్రతినిధులు కట్టమూరి చంద్రశేఖరం, నేమాని భద్రాద్రి సీతారామం, డాక్టర్ ఉలిమిరి వెంకట సోమయాజులు, తదితరులు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక శంకరమఠంలో నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జూలై ఆరో తేదీ నుంచి 14 వరకు శంకరమఠం వేదికగా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. జూలై ఐదో తేదీ సాయంత్రం 5 గంటలకు శోభాయాత్ర, ఆరో తేదీన ఉదయం 6 గంటలకు మహా గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, ఋత్విక్‌వరుణ దీక్షాధారణ, అగ్నిమథనం, తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 12 వరకు... మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పారాయణం ఉంటుందన్నారు. జూలై 13న సాయంత్రం 4 గంటలకు పూర్ణాహుతి, 5.30 గంటలకు సీతారామ కళ్యాణం, జూలై 14న ఉదయం 7 గంటలకు శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం ఉంటుందన్నారు. భక్తులందరూ శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాల్లో పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో చీలా నారాయణమూర్తి, భోగరాజు సూర్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

డెంకాడ: కౌలు రైతుందరూ పంట సాగుహక్కు కార్డులను (సీసీఆర్‌సీ) రెవెన్యూ అధికారుల ద్వారా పొందాలని తహసీల్దార్ రామారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కౌలు రైతుల కార్డులకు సంబంధించి రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌలు రైతులకు కౌలు కార్డులు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. కౌలు కార్డులు ఉన్న రైతులకు పంట నమోదుతో పాటు ప్రభుత్వం ద్వారా పొందాల్సిన ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కౌలు రైతులు కార్డులు పొందాలంటే సొంత పొలం రైతు పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ జిరాక్స్, స్వంత భూయజమాని ఆధార్‌కార్డు, కౌలురైతు ఆధార్‌కార్డు ఉండాలన్నారు. అలాగే కౌలు రైతు 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ఇవ్వాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు మాత్రమే అన్నదాత సుఖీభవకి అర్హులన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని ప్రముఖ సంఘ సేవకుడు, సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు పిలుపునిచ్చారు. స్థానిక అయ్యన్నపేట కూడలిలో ఉన్న వాకింగ్ గ్రౌండ్‌లో సాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ, పాలిథిన్/ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగంతో పర్యావరణం పాడవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు కలుషితమై రాబోవు తరాలు ఇబ్బంది పడతాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యకర సమాజ రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతిరావు, కార్యదర్శి ఐవీ ప్రసాదరావు, కోశాధికారి ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, క్లబ్ సీనియర్ సభ్యులు కోట్ల సత్యనారాయణ, నలమహారాజు, కనపాక నాగరాజు, వల్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకర్లకు అభినందన



రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ, అధ్యాపకులు

చీపురుపల్లి: ప్రభుత్వ కళాశాలలో చదివి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ విద్యార్థులకు సూచించారు. ఇదే కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఇటీవల వెలువడిన ఏపీపీజీసీఈటీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్సీ గణితం విభాగంలో ముగడ విజయలక్ష్మి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంక్, భౌతికశాస్త్రం విభాగంలో దమరసింగి గాయత్రి 67వ ర్యాంక్, వృక్షశాస్త్రం విభాగంలో కె.రమాదేవి 45వ ర్యాంక్, బి.భవాని 29వ ర్యాంక్, ఆర్.శిరీష 147వ ర్యాంక్, జి.రామలక్ష్మి 332వ ర్యాంక్, జంతుశాస్త్ర విభాగంలో జె.నవ్య 98వ ర్యాంకు సాధించారని చెప్పారు. తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు మూడేళ్లు ఎంతో కష్టపడి చదవడంతోనే ఇలాంటి ఫలితాలు వచ్చాయని, వారిని మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో వారికి మించిన ర్యాంకులు సాధించాలని కోరారు. కళాశాలలో అన్ని సబ్జెక్టులకు శాశ్వత అధ్యాపకులు ఉన్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు కె.రమేష్‌కుమార్, పి.మల్లేశ్వరరావు, ఏ.చంద్రమౌళి, వై.విజయభారతి, కె.జ్వాలాముఖి, బి.విజయేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

శృంగవరపుకోట: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో కొత్తవలస సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) విజయ బుధవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో రికార్డులు, ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విక్రయాలు, స్టాక్‌కు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవడంతో కోరమండల్, శ్రీ బాలాజీ ట్రేడర్స్ దుకాణాల్లో విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. అలాగే మండలంలోని గోపాలపల్లిలో ఏఓ రవీంద్ర ఆధ్వర్యంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు.